దోచుకో.. దాచుకో ఇదే కాంగ్రెస్ నినాదం

- గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష రద్దయ్యేలా ఉంది
- కాంగ్రెస్ వచ్చాక రేవంత్, రాహుల్‌కే జాబ్స్
- 25సార్లు ఢిల్లీ వెళ్లి 25 పైసలు కూడా తేలే
- తెలంగాణకు బీజేపీ కూడా ప్రమాదకరమే
- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు రక్ష
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ సమావేశం

తెలంగాణభవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్వీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, అక్టోబరు 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో అందినకాడికి దోచుకో, దాచుకో ఇదే విధానంగా ఉందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. రాష్ట్రంలో చిట్టినాయుడి పాలనలో బాధపడని వాళ్లు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. రేవంత్, రాహుల్‌కు తప్ప మరెవరికీ ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొన్నారు. వాళ్లు ఇచ్చిన కొత్త నోటిఫికేషన్ ఒక్కటీ రాలేదన్నారు. లోపభూయిష్ట విధానాలతో గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ రద్దయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రశ్నించకుంటే తెలంగాణ మూగబోతుందని పేర్కొన్నారు. కొన్ని చిన్న చిన్న పొరపాట్లు చేశామని, వాటన్నింటినీ సరిదిద్దుకొని ప్రజలకు మరింత దగ్గరవుదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్వీ నాయకులకు రాజకీయంగా మెరుగైన అవకాశాలు లభిస్తాయని ప్రకటించారు. గుంపు మేస్త్రీ అంటే ఇండ్లు కట్టే టోళ్లు కానీ ఈ సీఎం మాత్రం కట్టిన ఇండ్లను కూల గొట్టేటోడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన గురువారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మహా ఉద్దండ పిండాలు, గజకర్ణ, గోకర్ణ నాయకులు చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలాంటి వాళ్లతో కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. అంతటి ఉద్ధండుల ముందు ఈ చిట్టి నాయుడు ఒక లెక్క కాదని పేర్కొన్నారు. ఈ చిట్టి నాయుడిని తిట్టాలన్న, ఏదైనా చెప్పాలన్నా మనసు రావడం లేదన్నారు. ఆయనకు ఏమీ తెల్వదని, ఏమీ తెల్వదన్న విషయం కూడా ఆయనకు తెల్వదని ఎద్దేవా చేశారు. మొన్న వికారాబాద్ వెళ్లి హైదరాబాద్ చుట్టు మూడు దిక్కుల సముద్రం ఉందంటాడని, ఆగస్ట్ 15న స్పీచ్‌లో భాక్రానంగల్ డ్యాం తెలంగాణలో ఉందంటాడని ఎద్దేవా చేశారు. రాసిచ్చినది కూడా చూసుకోకుండా చదువుతాడంటూ విమర్శించారు. విప్రో సీఈవో సత్య నాదెళ్ల అంటాడని, ఇలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు.

> కేసీఆర్ హయాంలో గురుకులాల విద్యార్థులు మౌంట్ ఎవరెస్ట్ ఎక్కితే, చిట్టి నాయుడు మాత్రం గురుకులాలను పాతాళంలోకి నెట్టేస్తున్నాడు. - కేటీఆర్

ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత మనదే

రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి బాధపెట్టినా ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావాలని, 95 శాతం కొలువులు మన బిడ్డలకే దక్కేట్టు పోరాటం చేసి రాష్ట్రపతి ఉత్తర్వులు తెచ్చింది కేసీఆర్ అని గుర్తుచేశారు. జిల్లాకు ఓ మెడికల్ కాలేజ్, నర్సింగ్ కళాశాల, గురుకులాలు. ఇవన్నీ మనం సాధించిన విజయాలని, తెలంగాణ మీద ప్రేమ ఉన్న కేసీఆర్ కాబట్టే ఇవన్నీ సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ వర్గం ప్రజలకు కష్టం వచ్చినా వెతుక్కొని తెలంగాణ భవన్‌కు వస్తున్నారన్నారు. ఆశా వర్కర్లు వచ్చి తాము అడగకుండానే కేసీఆర్ తమకు రూ.9,900 ఇచ్చారని గుర్తు చేస్తున్నారని, రూ.18 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబితే మోసం పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. చిట్టినాయుడిని కదిలించాలంటే 10, 12వేల మంది తరలి రావాల్సిన అవసరముందని వారికి చెప్పానని తెలిపారు. అవసరమైతే కేసీఆర్ కూడా వస్తారని చెప్పానని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్స్ రీ షెడ్యూల్ చేయాలని అశోక్‌నగర్‌లో పోరాటం చేసిన విద్యార్థులు తెలంగాణ భవన్‌కు వచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో విద్యార్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోపభూయిష్ట విధానాలతో మెయిన్స్ ఎగ్జామ్ రద్దయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

> మేం ఉన్నప్పుడు పెద్ద బిల్డింగ్‌ల పర్మిషన్లకు కూడా మంత్రిని కలవాల్సిన అవసరం రాలేదు. కానీ ఇప్పుడు కరెంట్ కనెక్షన్ కోసం కూడా రూ.25 లక్షలు తీసుకున్నారని ఓ బిల్డర్ చెప్పాడు. అందినకాడికి దోచుకో, అవన్నీ దాచుకో అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ వాళ్ల యవ్వారం. - కేటీఆర్

బీజేపీ కూడా ప్రమాదకారే

కాంగ్రెస్ మాత్రమే కాదని, తెలంగాణకు మరింత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ అని, మతాన్ని అడ్డం పెట్టుకొని రెచ్చగొట్టే పార్టీ బీజేపీ అని కేటీఆర్ ఆరోపించారు. గత పదినెలల్లో మన పార్టీ అన్ని కష్టకాలాలను అధిగమించిందని, కొన్ని పొరపాట్లు, కాంగ్రెస్ వాళ్లు ఇచ్చిన అడ్డగోలు హామీలతో బీఆర్ఎస్ ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదినెలల్లో అన్ని కష్టాలను అధిగమించామని, ఇప్పుడు ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా సరే మనల్నే తలచుకుంటున్నారని పేర్కొన్నారు. దసరా రోజు ప్రతి ఇంట్లో కేసీఆర్‌ను తలుచుకున్నారని తెలిపారు.

ప్రతి జిల్లాలో సమావేశాలు

ప్రతి జిల్లాల్లో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలని, ఎక్కడికక్కడ మీటింగ్‌లు పెట్టుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు చాకుల్లాంటి యువ నాయకత్వం ఉందని, కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంత జరుగుతున్నప్పటికీ ఆ పోరాటాన్ని చూపించే ధైర్యం ప్రధాన మీడియా చేయడం లేదని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో బూతులు తిట్టవద్దని, అది మన తెలంగాణ సంస్కృతి కాదని, సబ్జెక్టును మాత్రమే చర్చకు పెడదామని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలదని, డీఎంకే మాదిరిగా మరో 70 ఏళ్ల పాటు బలంగా ఉండేలా తీర్చిదిద్దుకుందామని పేర్కొన్నారు.

> స్కూళ్లలో చాక్‌పీస్‌లకు కూడా ఈ సీఎం వద్ద పైసలు లేవట. కానీ, మూసీలో పారబోసేందుకు రూ.1.5 లక్షల కోట్లు ఉన్నాయట. గురుకులాలకు అద్దె కట్టేందుకు డబ్బులు లేవు కానీ, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్లు దోచిపెడుతున్నారు. స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలుచేసేందుకు ఈ సీఎంకు ఏం రోగం. 25సార్లు ఢిల్లీ వెళ్లి 25 పైసలు తేలే. తన సీటును కాపాడుకునేందుకు మాత్రం హైకమాండ్‌కు కప్పం కడుతున్నడు. ఢిల్లీకి మూటలు సర్దేందుకే సీఎంకు సమయం సరిపోతున్నది. - కేటీఆర్

తెలంగాణ భవన్ వైపు పేదల చూపు

అశోక్‌నగర్‌కు వెళ్లాల్సి ఉన్నప్పటికీ అక్కడ పోలీసులను పెట్టడంతో విద్యార్థులే తెలంగాణ భవన్‌కు వచ్చారని కేటీఆర్ తెలిపారు. ప్రజలకు కష్టమొస్తే గాంధీభవన్, బీజేపీ ఆఫీస్ వైపు కాకుండా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల గూడు కూలగొడుతుంటే కేసీఆర్‌కు చెప్పుకుంటే సమస్య తీరుతదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. తాను బయలుదేరే ముందు ఇంటి వద్దకు ఆటో యూనియన్ వాళ్లు కూడా వచ్చి వాళ్ల ధర్నాకు రావాలని కోరారని తెలిపారు. చిట్టినాయుడి పాలనలో బాధపడని వాళ్లు లేరని, ఊళ్లలో రైతులు పొట్టు పొట్టు తిడుతున్నారని అన్నారు. తులం బంగారం, బతుకమ్మ చీరలు ఏదీ దిక్కులేని పరిస్థితి తెచ్చారన్నారని మండిపడుతున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులకు సాయమేది?

టెన్త్ పాసైతే చాలు 10 వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ పాసైతే 25 వేలు, పీజీ పాసైతే లక్ష, పీహెచ్‌డీ చేస్తే లక్ష అన్నారని కేటీఆర్ గుర్తు చేశారు. ఎవరికైనా వచ్చాయా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో 60 డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేశారని, ఇంటర్ రెసిడెన్షియల్ కాలేజీలు 146 ఉంటే 592 చేశారని, గురుకుల రెసిడెన్షియల్ స్కూళ్లను 294 నుంచి 1022 కు పెంచారని, మెడికల్ కాలేజీలు 5 ఉంటే 33 చేశారని, నర్సింగ్ కాలేజీలను కూడా 33 చేశారన్నాని గుర్తుచేశారు. మెడికల్ సీట్లు 800 నుంచి 3,581 కు తీసుకొచ్చారని పేర్కొన్నారు. సిద్దిపేటలో ఒకే ఇంట్లో నాలుగు మెడిసిన్ సీట్లు వచ్చాయంటే చాలా సంతోషం అనిపించిందన్నారు.

> మనమే పోరాటం చేయాలని, కేసులు పెట్టినా సరే భయపడవద్దని సూచించారు. మన లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేసుకుందామని తెలిపారు. పోలీసులు కూడా కాంగ్రెస్ కార్యకర్తల్లా మారిపోయారని, మనం సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికీ పంపించాలని కోరారు. పేదల ఇండ్లు కూలగొడుతుంటే, కేసులు పెడుతుంటే బీజేపోళ్లు మాట్లాడుతున్నారా? మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్ జరిగితే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదని, తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ అన్నారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, తెలంగాణకు శ్రీరామరక్ష కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండా మాత్రమేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో బూతులు తిట్టవద్దని, అది మన తెలంగాణ సంస్కృతి కాదని, సబ్జెక్టును మాత్రమే చర్చకు పెడదామని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలదని, డీఎంకే మాదిరిగా మరో 70 ఏళ్ల పాటు బలంగా ఉండేలా తీర్చిదిద్దుకుందామని పేర్కొన్నారు.

దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ప్రమాదంలో ఉందని అన్నారు. మలిదశ ఉద్యమ రోజులు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయని తెలిపారు. బంజరు తెలంగాణగా ఉన్నదాన్ని బంగారు తెలంగాణ రాష్ట్రంగా మారిస్తే, ఇప్పుడు మళ్లీ బంజరు రాష్ట్రంగా మార్చడానికి కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. సమీకృత గురుకులాల జీవో కూడా చదవలేని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు.

విద్యార్థులకు రాజకీయ అవకాశాలు

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకత్వం పోరాడాలని కోరారు. గతం లో ప్రభుత్వాలను ఒప్పించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూశామని తెలిపారు. బీఆర్ఎస్‌లో మాత్ర మే విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు లభించాయని గుర్తుచేశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్, బీఆర్ఎస్వీ నేతలు దావ వసంత, చిరుమల్ల రాకేశ్‌కుమార్, కే కిషోర్‌గౌడ్, శుభప్రదపటేల్, అంజనేయగౌడ్, కే వాసుదేవరెడ్డి, బాలరాజు యాదవ్, తుంగ బాలు, కడారి స్వామియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



ముందు చూపుతో ఇల్లు ఇలా కట్టుకున్నా గురూ.. హైడ్రా వచ్చిందని తెలిస్తే మరో చోటుకు వెళ్తున్నా!

సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలి

హైకోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల అప్పీళ్లు

విచారణకు స్వీకరించిన డివిజన్ బెంచ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తప్పుడు సమాధానాలతో కూడిన తుది కీ ఆధారంగా నిర్వహించే గ్రూప్-1మెయిన్స్ పరీక్ష ప్రభావం ఎంపికపై ఉంటుందంటూ హైకోర్టులో పలువురు గ్రూప్-1 అభ్యర్థులు అప్పీళ్లను దాఖలు చేశారు. సింగిల్ జడ్జి ఈ నెల 15న ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరారు. గ్రూప్-1 ప్రిలిమినరీ కీలో తప్పులున్నాయని పలు ఆధారాలను సమర్పించినప్పటికీ సింగిల్ జడ్జి పట్టించుకోలేదని తెలిపారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టే అవకాశం ఉన్నది. 'కేసులోని పూర్వాపరాలను, వాస్తవాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. టీజీపీఎస్సీ ప్రకటించిన తుది కీలో తప్పులున్నాయని ఆధారాలు చూపినా వాటి జోలికి వెళ్లలేదు. దీనిపై మా వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రశ్నల్లో ఏ రకంగా తప్పులున్నాయో చెప్పినా పరిశీలించలేదు. ప్రశ్నకు ఐచ్ఛిక సమాధానాల్లో సరైనది లేనపుడు ఆ ప్రశ్నను తప్పుగా పరిగణించాలి. కానీ ఆ విధంగా జరుగలేదు. మెలికలతో కూడిన ప్రశ్నలు ఉండాలంటూ సర్వీస్ కమిషన్ చేసిన వాదనను సింగిల్ జడ్జి ఆమోదించడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలి. 41, 119వ ప్రశ్నలను పరిశీలిస్తే.. తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేవి. ఈ రెండు ప్రశ్నలను తొలగించడం వల్ల మెరిట్ జాబితాపై ప్రభావం పడుతుంది. ఇలాంటి కీ ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థుల జాబితా రూపొందించడం చట్ట వ్యతిరేకం. ప్రాథమిక పరీక్ష ఒక్కటే ఎంపికకు ప్రామాణికం కాబోదు. ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమేనని సింగిల్ జడ్జి పేర్కొనడం చెల్లదు. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాల్సిందే' అని పిటిషనర్లు తమ అప్పీళ్లల్లో కోరారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

21 నుంచి 27 వరకు పరీక్షలు

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తేతెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరగనున్న పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. గురువారం సెక్రటేరియట్ నుంచి టీజీపీఎస్సీ నుంచి చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీజీపీ జితేందర్‌తో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లతో పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు నేరుగా పరీక్షలను పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. 2011 తర్వాత ఈ పరీక్షలు జరుగుతున్నాయని, ఎలాంటి అపోహలు, పుకార్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని టీజీపీఎస్సీ నుంచి చైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్దేశించారు. అన్ని సెంటర్ల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని డీజీపీ జితేందర్ చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని టీజీపీఎస్సీ కార్యదర్శి నికోలస్ వివరించారు.

అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి రాస్తారోకో చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

నిరసన బాటలోనే గ్రూప్-1 అభ్యర్థులు

- రెండోరోజూ అర్ధరాత్రిదాకా నిరసనలు
- అభ్యర్థుల వినతితో వస్తానన్న కేటీఆర్
- అశోక్‌నగర్ చౌరస్తాలో పోలీసుల మోహరింపు.. పలువురి అరెస్ట్

చిక్కడపల్లి, అక్టోబర్17: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న గ్రూప్స్ అభ్యర్థులు పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయ డం లేదు. రెండోరోజైన గురువారం కూడా నిరసనను కొనసాగించారు. అర్ధరాత్రి దాక అరెస్టుల పర్వం కొనసాగింది. ఈ నెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు హైదరాబాద్ అశోక్‌నగర్ రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. గురువారం కూడా గాంధీనగర్ కెనరాబ్యాంక్ సమీపంలో ఉన్నపార్కులో వందలాది మంది గ్రూప్స్ అభ్యర్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈక్రమంలో పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. ముషీరాబాద్ పోలీసులు దాదాపు 15 మందిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

అశోక్‌నగర్‌లో పోలీసుల నిర్బంధకాండ

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని గ్రూప్స్ అభ్యర్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాలతో పోలీసులు అశోక్‌నగర్‌లో నిర్బంధకాండ కొనసాగిస్తున్నారు.అభ్యర్థుల వినతి మేరకు వారిని కలువడానికి వస్తానని గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించిన నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అశోక్‌నగర్ చౌరస్తా సహా ఇతర ప్రాంతాల్లో నిర్బంధ వాతావరణం కనిపించింది. నలుగురు గుమిగూడితే చాలు వారి వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. దీంతో అభ్యర్థులతోపాటు స్థానికులు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు.

తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశమైన గ్రూప్స్ అభ్యర్థులు

గ్రూప్-1 డిమాండ్లను పరిశీలించాలి

- అరెస్టయినవారిని విడుదల చేయాలి
- అన్ని విధాలుగా అండగా ఉంటాం
- మెయిన్స్ అభ్యర్థులకు కేటీఆర్ భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రీషెడ్యూల్ చేయాలన్న అభ్యర్థుల డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కోరారు. అభ్యర్థులే రీ షెడ్యూల్ చేయాలని కోరినప్పటికీ ప్రభుత్వం ఎందుకు మొండి పట్టుదలకు పోతున్నదని ప్రశ్నించారు. పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలంటూ అశోక్‌నగర్‌లో ఆందోళన చేపట్టిన అభ్యర్థులను అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలంటూ పోరాటం చేస్తున్న అభ్యర్థులు గురువారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. తమకు అండగా నిలవాలంటూ గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులు ఎక్స్ వేదికగా కేటీఆర్‌ను కోరిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జామ్స్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని అభ్యర్థులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. జీవో నంబర్-29 రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదని, రిజర్వేషన్ల విషయంలోనూ అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నదని వివరించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించి దాదాపు 22 కేసులు కోర్టులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం మొండిగా పరీక్షలు నిర్వహిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తాము సుప్రీంకోర్టుకు వెళ్తే కోర్టు కచ్చితంగా ఎగ్జామ్స్‌ను రద్దు చేస్తుందని, రద్దయ్యే ఎగ్జామ్స్ నిర్వహించడం సరికాదని చెప్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్నదని వాపోయారు. న్యాయపరమైన సమస్యలన్నీ తీరిన తర్వాతే ఎగ్జామ్స్ నిర్వహించాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అభ్యర్థుల అభిప్రాయాలను సావధానంగా విన్న కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్షంగా గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైన న్యాయసాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

జీవో- 29 వెనక్కి తీసుకున్నాకే పరీక్ష

ప్రభుత్వం జీవో-29ను వెనక్కి తీసుకున్న తరువాతే పరీక్ష నిర్వహించాలి. ఆ జీవో రాజ్యాంగ విరుద్ధం. కేసులు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకుండా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తున్నది. కేసులు అన్నీ పూర్తయ్యాకే మెయిన్స్ పరీక్ష పెట్టాలి. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదని, వికీపీడియా ప్రామాణికం అని టీజీపీఎస్సీ చెప్పున్నది. ఇదేం పద్ధతో అర్థం కావడం లేదు. మేం చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్‌ను కోరాం. పూర్తి అండగా నిలుస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. న్యాయపరంగా కూడా తగిన సాయం అందిస్తామని చెప్పారు. అవసరమైతే సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని అభయమిచ్చారు. అందుకు వారికి ధన్యవాదాలు.

-మహేంద్ర, గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థి

గాంధీభవన్‌కు పిలిచి అరెస్టుచేస్తారా?

మా సమస్యలను పరిష్కరించాలని కోరితే గాంధీ భవన్‌కు రమ్మని పిలిచారు. అక్కడికి వెళ్లిన వారిని అరెస్టు చేశారు. సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేస్తారా? హైకోర్టులో ఉన్న 22 కేసులు పూర్తి కాక ముందే మెయిన్స్ పరీక్ష పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. న్యాయపరమైన అంశాలతో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే పరీక్ష రద్దయ్యే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించాలి. మాకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటాం. కేసులన్నీ తేలాకే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలి.

-సింధు, గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థి

మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు

న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉన్నది. ఒక కోర్టులో రాష్ట్రానికి ఒక న్యాయం. మరో రాష్ట్రానికి మరో న్యాయం ఉండదు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా మా న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించండి. మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు.

-నర్సింహ, గ్రూప్-1 అభ్యర్థి

బలి చక్రవర్తిలా రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక విధాలుగా సాయం చేశాం. కానీ, అన్నింటినీ విస్మరించి మా గుండెలపై తన్నుతున్నరు. ఆనాడు సోనియాగాంధీని బలిదేవత అన్నడు. నేడు మా భవిష్యత్తును బలిచక్రవర్తిలా బలిపెడుతున్నడు. 40 లక్షల మంది నిరుద్యోగ బిడ్డల తల్లులను బాధపెడుతున్నరు. ఆ తల్లుల ఉసురు తగలకమానదు.

-రఘురాథోడ్, గ్రూప్-1 అభ్యర్థి

గ్రూప్స్ అభ్యర్థుల అరెస్టు అప్రజాస్వామికం

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

హైదరాబాద్, అక్టోబర్17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అశోక్‌నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్ 1 అభ్యర్థులపై లాఠీచార్జి చేసి, అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. నియంత పోకడలను తెలంగాణ సమాజం ఎన్నడూ సహించబోదని, కాంగ్రెస్ తన అప్రజాస్వామిక విధానాలను మార్చుకోవాలని హెచ్చరించారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. జీవో 29, 55పై ఎటూ తేల్చకుండా, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా, తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికమో? కాదో? చెప్పకుండా, మొత్తంగా 33 కేసులు పెండింగ్‌లో ఉండగానే, ఎలాంటి హామీ ఇవ్వకుండా పరీక్ష నిర్వహిస్తే అన్యాయం జరుగుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వారి డిమాండ్లు న్యాయ సమ్మతమైనవేనని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఒక కమిటీ వేసి గ్రూప్ 1 సమస్యను పరిష్కరించాలని, లేకుంటే నిరుద్యోగ యువతే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తుందని హెచ్చర